జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 15 | జూన్ | 2026 ◆ పేజీలు : 7

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 14, (ప్రజా జ్యోతి )** నేడు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.




- విధుల్లో ఉన్న పోలీసులనే ఢీకొట్టిన లారీ
- కానిస్టేబుల్, హోంగార్డుకు తీవ్ర గాయాలు
- అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు
- ఘర్షణల తర్వాత చోటుచేసుకున్న ఘటన
- సోంపల్లి ర్యాంపుపై మళ్లీ తెరపైకి వచ్చిన అక్రమాల ఆరోపణలు


### ఇసుక ర్యాంపులో...
# ఉద్రిక్తత...

5 లో..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సోంపల్లి ఇసుక ర్యాంపు వద్ద ఆదివారం చోటుచేసుకున్న పరిణామాలు జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అక్రమ ఇసుక రవాణా జరుగుతోందంటూ గ్రామస్తులు లారీలను అడ్డుకోవడం, అనంతరం పరిస్థితిని చక్కదిద్దేందుకు వెళ్లిన పోలీసు సిబ్బందినే ఇసుక లారీ ఢీకొట్టడం కలకలం రేపింది. ఈ ఘటనలో విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ మంగీలాల్, హోంగార్డు శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడగా, ప్రభుత్వ ఆస్తి కూడా ధ్వంసమైంది.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## భద్రాద్రిలో స్వల్ప భూకంపం!



- తెల్లవారుజామున ప్రకంపనలతో ఉలిక్కిపడ్డ ప్రజలు
- కొత్తగూడెం, పాల్వంచ, బూర్గంపాడు, భద్రాచలంలో భూమి కంపించిన అనుభూతి
- రిక్టర్ స్కేలుపై 3.8 తీవ్రత నమోదు... నష్టం లేదన్న అధికారులు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 14 (ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు ఆదివారం తెల్లవారుజామున ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. నిద్రలో ఉన్న సమయంలో భూమి స్వల్పంగా కంపించడంతో ప్రజలు భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొన్ని సెకన్ల పాటు ప్రకంపనలు నమోదవడంతో భూకంపం వార్త క్షణాల్లోనే వ్యాపించింది. జాతీయ భూకంప అధ్యయన కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం ఆదివారం

మిగతా 2 లో...

## రక్తదాతలుగా మారిన జవాన్లు

- సేవాభావం చాటిన 151వ బెటాలియన్




**చర్ల, జూన్ 14 (ప్రజాజ్యోతి ):** ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఆర్పీఎఫ్ 151వ బెటాలియన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రి

మిగతా 2 లో...

- విద్యార్థుల కేరింతలతో కళకళలాడనున్న పాఠశాలలు
- తొలి రోజే పాఠ్యపుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు
- జిల్లాలో 1,670 పాఠశాలల్లో సందడి
- విద్యార్థుల రాకతో మళ్లీ కళకళలాడనున్న తరగతి గదులు
- ప్రభుత్వ బడులపై పెరుగుతున్న తల్లిదండ్రుల నమ్మకం

## బడి బాట పట్టిన బాల్యం!

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 14 (ప్రజాజ్యోతి ):** వేసవి సెలవుల సందడి ముగిసింది... పుస్తకాల పరిమళం పరచుకునే సమయం వచ్చింది. ఆటపాటలతో గడిపిన రెండు నెలల విరామం అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి మళ్లీ బడిగంటలు మోగనున్నాయి. విద్యార్థుల కేరింతలు, ఉపాధ్యాయుల ఆత్మీయ పలకరింపులు, కొత్త పుస్తకాలతో పాఠశాల ఆవరణలు మరోసారి కళకళలాడనున్నాయి. "విద్య అనే వెలుగు జీవితానికి వెలుగుబాట" అన్నట్లుగా కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం పలి




కేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. రంగురంగుల

మిగతా 2 లో...

# బడి బాట పట్టిన బాల్యం!

(మొదటి పేజీ తరువాయి...)
అలంకరణలు, పరిశుభ్రమైన తరగతి గదులు, విద్యార్థుల రాక కోసం ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులతో పాఠశాలలు కొత్త ఉత్సాహాన్ని సంతరించుకున్నాయి.

### ››› అడ్మిషన్లలో జోరు... విద్యార్థుల చేరికల్లో పెరుగుదల

ఈసారి విద్యా సంవత్సరానికి ముందుగానే ప్రవేశాల ప్రక్రియను వేగవంతం చేయడంతో జిల్లాలో అడ్మిషన్లు ఆశాజనకంగా నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎక్కువ మంది విద్యార్థులు వివిధ పాఠశాలల్లో చేరినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల, ఆశ్రమ, కేజీబీవీ, సంక్షేమ విద్యా సంస్థలు కలిపి మొత్తం 1,670 పాఠశాలలు ఉండగా, వాటిలో 1,69,493 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 84,108 మంది బాలురు, 85,385 మంది బాలికలు ఉన్నారు.

### ››› ప్రభుత్వ బడుల వైపు పెరుగుతున్న అడుగులు



ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే వెనుకంజ వేసిన తల్లిదండ్రులు, నేడు అదే పాఠశాలల వైపు ఆసక్తి చూపుతున్నారు. మౌలిక సదుపాయాల మెరుగుదల, ఆంగ్ల మాధ్యమ బోధన, డిజిటల్ తరగతులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ బడులపై విశ్వాసం పెరుగుతోంది. "ఫీజులు కాదు... ఫలితాలే ముఖ్యం" అనే భావనతో అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం విశేషం. విద్యార్థుల చేరికల్లో నమోదవుతున్న పెరుగుదల ఈ మార్పుకు నిదర్శనంగా నిలుస్తోంది.

### ››› తొలి రోజే పుస్తకాల పండుగ

కొత్త విద్యా సంవత్సరాన్ని మరింత ఉత్సాహంగా ప్రారంభించేందుకు విద్యాశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయనున్నారు. దీంతో విద్యార్థులు తొలి రోజు నుంచే బోధన ప్రక్రియలో భాగస్వాములు కానున్నారు. అలాగే యూనిఫారాలు, నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రి పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను కూడా అధికారులు పూర్తి చేశారు.

### ››› విద్యార్థుల కోసం సిద్ధమైన పాఠశాలలు

తరగతి గదుల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, విద్యుత్, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం అమలు వంటి అంశాలపై ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించారు. పాఠశాలలన్నీ విద్యార్థులకు అనుకూల వాతావరణాన్ని కల్పించేలా చర్యలు చేపట్టాయి. ఉపాధ్యాయులు కూడా కొత్త విద్యా సంవత్సరం కోసం కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకుని విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు సన్నద్ధమయ్యారు.

### ››› కొత్త కలలు... కొత్త లక్ష్యాలు

కొత్త తరగతి, కొత్త పుస్తకాలు, కొత్త స్నేహితులు, కొత్త ఆశయాలతో విద్యార్థులు మరో విద్యా ప్రయాణానికి
శ్రీకారం చుడుతున్నారు. చిన్నారి చేతిలో పుస్తకం ఉంటే దేశ భవిష్యత్తు భద్రంగా ఉంటుందనే మాటలను నిజం చేస్తూ జిల్లాలో మరో విద్యా సంవత్సరం ప్రారంభమవుతోంది. బడి గంట మోగింది... భవిష్యత్తు బాట మొదలైంది. జ్ఞానమే శక్తి, విద్యే విజయానికి పునాది అనే స్ఫూర్తితో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యార్థులు కొత్త విజయాల వైపు అడుగులు
వేయాలని విద్యావేత్తలు ఆకాంక్షిస్తున్నారు.

## రక్తదాతలుగా మారిన జవాన్లు






(మొదటి పేజీ తరువాయి...)
సహకారంతో యూనిట్ ఆసుపత్రి ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. 151వ బెటాలియన్ కమాండెంట్ రాజీవ్ కుమార్ మార్గనిర్దేశంలో నిర్వహించిన ఈ శిబిరంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కింటాలి సౌమ్య, అసిస్టెంట్ కమాండెంట్లు అశుతోష్ సారంగి, శుభం కుమార్ మహోరియా పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సామాజిక సేవా దృక్పథంతో ముందుకు వచ్చిన జవాన్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మొత్తం 18 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. సేకరించిన రక్తాన్ని అత్యవసర వైద్య అవసరాల కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చని సమాజంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజల సేవలో సీఆర్పీఎఫ్ జవాన్లు ఎల్లప్పుడూ ముందుంటారని ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.

## భద్రాద్రిలో స్వల్ప భూకంపం!

(మొదటి పేజీ తరువాయి...)
తెల్లవారుజామున 2:26 గంటలకు భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 3.8గా నమోదైంది. భూకంప కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో, రాజమండ్రికి వాయువ్య దిశగా సుమారు 111 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

### • ఉలిక్కిపడ్డ జిల్లా

కొత్తగూడెం, పాల్వంచ, బూర్గంపాడు, భద్రాచలం తదితర ప్రాంతాల్లో స్వల్ప ప్రకంపనలు స్పష్టంగా అనుభూతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అర్ధరాత్రి తర్వాత అకస్మాత్తుగా ఇళ్లు, ఫ్యాన్లు, తలుపులు స్వల్పంగా కంపించినట్లు గుర్తించిన ప్రజలు భయంతో బయటకు వచ్చారు. కొద్ది సెకన్ల పాటు కొనసాగిన ఈ ప్రకంపనలు ప్రజల్లో ఆందోళన రేకెత్తించాయి.

### • నష్టం లేదు... అప్రమత్తంగా ఉండాలని సూచన

భూకంపం తీవ్రత తక్కువగా ఉండటంతో ఎలాంటి ప్రాణనష్టం గానీ, ఆస్తి నష్టం గానీ సంభవించలేదని అధికారులు స్పష్టం చేశారు. పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

### • అరుదుగా నమోదయ్యే ప్రకంపనలు

తెలంగాణలో భూకంపాలు అరుదుగా నమోదవుతుంటాయి. అయితే గోదావరి పరివాహక ప్రాంతాల్లో అప్పుడప్పుడు స్వల్ప ప్రకంపనలు సంభవిస్తుంటాయి. తాజా ఘటనతో జిల్లా ప్రజల్లో కొంత ఆందోళన నెలకొన్నప్పటికీ, పెద్ద ప్రమాదం ఏదీ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.




## దమ్మపేటలో విషాదం.. బావిలో పడి యువకుడి మృతి



**దమ్మపేట, జూన్ 14 (ప్రజాజ్యోతి) :** దమ్మపేట గ్రామంలో ఓ యువకుడు ఇంటి ఆవరణలోని బావిలో పడి మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, దమ్మపేట గ్రామానికి చెందిన బుజ్జూరి లక్ష్మీనారాయణ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ కొంతకాలంగా మద్యానికి బానిసైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వారి ఇంటి వద్ద ఉన్న బావిలో పడి మృతి చెందినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకోగా అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. ఈ ఘటనపై మృతుడి అన్న బుజ్జూరి జయప్రకాష్ దమ్మపేట పోలీసులకు పిటిషన్ అందజేయగా, పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

**దమ్మపేట, జూన్ 14 (ప్రజాజ్యోతి):** గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడగా, బాధితుడి అన్న ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, రెడ్యాలపాడు గ్రామానికి చెందిన కొరస అభిలాష్ మే 29న గండుగులపల్లి శివారులో రోడ్డుపై వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని కాలికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో వైద్యం పొందుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై బాధితుడి అన్న కొరస నరసింహారావు దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన వాహనం, డ్రైవర్‌ను గుర్తించే పనిలో ఉన్నారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## గాలం నారాయణరావుకు యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్ష పదవి

### • అన్నపురెడ్డిపల్లి మండల బాధ్యతలు అప్పగింత




**అన్నపురెడ్డిపల్లి, జూన్ 14 (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా గాలం నారాయణరావు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. పార్టీ పట్ల గాలం నారాయణరావు యాదవ్ చూపుతున్న అంకితభావం, నిరంతర శ్రమ, యువతను సంఘటితం చేయడంలో కనబరుస్తున్న చొరవను గుర్తించిన అధిష్ఠానం ఈ బాధ్యతను అప్పగించినట్లు నాయకులు తెలిపారు. ఆయన నాయకత్వంలో మండల యువజన కాంగ్రెస్ మరింత బలోపేతం కావడంతో పాటు పార్టీ కార్యక్రమాలు గ్రామస్థాయిలో మరింత విస్తరించే అవకాశముందని పేర్కొన్నారు. యువత సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో గాలం నారాయణరావు యాదవ్ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజా సేవలో విశేషంగా రాణించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సుమిత్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల నరేష్ బాబు గాలం నారాయణరావు యాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు ఆయన చేసే ప్రతి కార్యక్రమానికి తమ పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు.

# వ్యవసాయ క్షేత్రంలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

- పదేపదే ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది..?
- ట్రాన్స్‌ఫార్మర్‌కు ముప్పు.. రైతుల్లో ఆందోళన
- లైన్మెన్ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు







**టేకులపల్లి, జూన్ 14,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని సింగ్యతండ గ్రామలోని పరిధిలో వ్యవసాయ క్షేత్రాల్లో ఏర్పాటు చేసిన సులానగర్ విద్యుత్ లైన్ స్తంభాలు ప్రమాదకరంగా ఒరిగిపోయి నెలలు గడుస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది స్పందించకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు కూలిపోతాయోనన్న భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.వ్యవసాయ పొలాల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలు ఒకదానిపై ఒకటి ఆనుకున్నట్టుగా వంగిపోవడంతో పాటు విద్యుత్ తీగలు కూడా అసురక్షిత స్థితిలో ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత లైన్మెన్‌తో పాటు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు.ఇప్పటికే కొన్ని స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్ వైపు ఒరిగి ఉండటంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో బలమైన గాలులు, భారీ వర్షాలకు స్తంభాలు పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్తంభాలు కూలిపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, రైతులు, వ్యవసాయ కార్మికుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లవచ్చని చెబుతున్నారు." ప్రమాదం జరగక ముందే స్పందించాలి "ప్రజల ప్రాణాలు, రైతుల ఆస్తులకు ముప్పుగా మారిన ఈ విద్యుత్ స్తంభాలను వెంటనే పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుని ప్రమాదాన్ని నివారించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఒరిగిన స్తంభాలను సరిచేసి రైతుల ఆందోళనను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు."ప్రమాదం జరిగితే బాధ్య త ఎవరిది?" అంటూ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై రైతులు ప్రశ్నిస్తున్నారు.

## రజబలినగర్ విద్యార్థులకు నూతన పాఠ్యపుస్తకాల పంపిణీ

- విద్యతోనే ఉన్నత భవిష్యత్తు సాధ్యం : ఎంఈఓ ఉండేటి ఆనంద్ కుమార్



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 14 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలం పెద్దిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజన ఆవాస ప్రాంతం రజబలినగర్ పాఠశాల విద్యార్థులకు ఎంఈఓ ఉండేటి ఆనంద్ కుమార్ నూతన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, పెన్సిళ్లను ఆదివారం అందజేశారు.ఎంఈఓ ఉండేటి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలో 11 మంది విద్యార్థులు విద్యనభ్యసించగా, ప్రస్తుతం 16 మంది విద్యార్థులు ఉన్నారని, భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన తాత్కాలిక తరగతి గదిని, మధ్యాహ్న భోజన వంట ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎంఈఓ ఉండేటి ఆనంద్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మడకం మహేష్, మార్వి జోగా, పొడియం ఉంగా, పొడియం గంగా పాల్గొన్నారు.

## పీఆర్సీ వెంటనే ప్రకటించాలి.. లేకుంటే ఉద్యమం తప్పదు

- పాఠశాలల కుదింపు ఆలోచన విరమించుకోవాలి
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు అవసరం: ఆదిమూలం వెంకట్

**కొత్తగూడెం, జూన్ 14 ( ప్రజాజ్యోతి )** ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టాల్సి వస్తుందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విస్తృత కమిటీ సమావేశం ఆదివారం జిల్లా అధ్యక్షుడు బి. మురళీమోహన్ అధ్యక్షతన కొత్తగూడెంలోని టీచర్స్ భవన్‌లో నిర్వహించారు. ఆదిమూలం వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేల పాఠశాలలకు కుదించాలనే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలల మూసివేత లేదా విలీనాలపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి గ్రామపంచాయతీలో కనీసం ఒక ప్రభుత్వ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా అభివృద్ధి చేయాలని నర్సరీ, కేజీ తరగతులు ప్రారంభించి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, నోటుబుక్స్, యూనిఫాంలను విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల అసమతుల్యత, ప్రీ-ప్రైమరీ విద్య లేకపోవడం, మౌలిక సదుపాయాల కొరత వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇప్పటివరకు 8.22 శాతం దాటలేదని విమర్శించారు. యంగ్ ఇండియా, టీపీఎస్ వంటి ప్రత్యేక పాఠశాలల కంటే ప్రజలందరికీ అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపైనే దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి. రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా ఆఫీస్ బేరర్లు ఎం. రాజయ్య, ఎస్. వెంకటేశ్వర్లు, హథీరాం, తావుర్య, రాము, పద్మారాణి, ఆర్. రమేశ్ కుమార్, గంగాధర్, డి. దాసు, ఎం. సత్యనారాయణ, షేక్ పాషా, మంగీలాల్, సత్యశ్రీ, జానకి, జయాబాయి, యశోద, రాష్ట్ర కమిటీ సభ్యుడు బి. కిషోర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## మోకాళ్ళ శరత్ చంద్రకు ఘన సన్మానం





**ఇల్లందు, జూన్ 14 (ప్రజా జ్యోతి)** జేఈఈ అడ్వాన్స్ లో జాతీయస్థాయిలో ఓపెన్ క్యాటగిరి విభాగంలో 382, ఎస్టి కేటగిరి విభాగంలో నాలుగో ర్యాంకు సాధించి దేశంలో ప్రతిష్టాత్మకమైన ఐఐటి ముంబై నందు సిఎస్సి బ్రాంచ్ లో సీటు సాధించిన మోకాళ్ళ శరత్ చంద్ర, తల్లిదండ్రులను ఆదివారం టీఎస్ ఏటిఎఫ్, ఆదివాసి హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మోకాళ్ళ శ్రీనివాసరావు, కబ్బాకుల రవి మాట్లాడుతూ భారతదేశంలోని ఉత్తమ ఐఐటి కాలేజీలో మోకాళ్ళ శరత్ చంద్ర సిఎస్సి విభాగంలో సీటు సాధించడం సంతోషకరమన్నారు. దేశవ్యాప్తంగా టాప్ ర్యాంకర్స్ కు మాత్రమే ముంబై ఐఐటి లో సీట్లు వస్తాయని అలాంటి సంస్థలు ఆదివాసి మన్యం ప్రాంతం నుండి అడ్మిషన్ పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. శరత్చంద్ర సీటు సాధించడంలో వారి తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉందని, ఐఐటీలో తన ప్రతిభ కనబరిచి భవిష్యత్తులో సివిల్స్ సాధించి, సమాజానికి సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఏటిఎఫ్ సభ్యులు మోకాళ్ళ రాధ, కుంజ కృష్ణ, ఉండం నాగేంద్రరావు, ఊకే కృష్ణ, రామేశ్వరి, కోడెం కృష్ణ, స్వరూప, తోలెం ఈశ్వర్, మోకాళ్ళ కృష్ణార్జునరావు, గల్లీగా రాంబాబు, గీతపల్లి కృష్ణ, చుంచు రవీందర్, కల్తీ రామకృష్ణ, ఈసాల రాంబాబు, ఊకే పోచలయ్య, పాయం సర్వేశ్వరరావు, గుంపిడి చుక్కయ్య, కోర్స రాజేష్, సూర్ణబాక వీరస్వామి, మోకాళ్ళ భాను ప్రసాద్, మోకాళ్ళ సంజన, మోకాళ్ళ అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీని ప్రధాని కావడంలో బిఎల్ఎ లదే కీలక బాధ్యత





**ఇల్లందు, జూన్ 14 (ప్రజా జ్యోతి)** రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాని కావడంలో బిఎల్ఎ లదే కీలక బాధ్యత అని ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని రాజస్థానీ సేవా ట్రస్ట్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఇల్లందు నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ శిబిరంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టిపిసిసి అసెంబ్లీ కోఆర్డినేటర్ వరప్రసాద్ బూతు లెవల్ ఏజెంట్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై క్షుణ్ణంగా వివరించడం జరిగిందన్నారు. ప్రతి బూతులు ఆఫీసర్లు వస్తారని, అయ్యా బూతుల్లో ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత బిఎల్ఎలపై ఉందని తెలిపారు. ఒకే ఇంటి ఓట్లు వేరు వేరు వార్డులలో ఉంటే వాటిని ఒకే వార్డులో వచ్చేలా చేయాలని సూచించారు. మన ఓటు పోవద్దని, దొంగ ఓటు చేరోద్దని ఆ బాధ్యతను బిఎల్ఎ దే అన్నారు. బీహార్, పశ్చిమబెంగాల్ లో ఓట్లను తొలగించి అడ్డదారిలో బిజెపి అధికారం దక్కించుకుందని ఆరోపించారు. ఓట్లు చోరీతో పాటు రాజ్యసభ ఎన్నికలలో ఈసీని తమ గుప్పెట్లో ఉంచుకొని మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరించి బిజెపి రాజ్యసభ సీటు దొంగిలించిందని విమర్శించారు. ఈ శిక్షణ శిబిరంలో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, భూక్య ఉమా మురళి నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బోడా మంగీలాల్ నాయక్, ఇల్లందు పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భోళ్ల సూర్యం, మండల రాము, టేకులపల్లి, కామేపల్లి మండలాల అధ్యక్షులు లక్కినేని శ్యామ్, గుజ్జర్లపూడి రాంబాబు, నాయకులు మూల మధుకర్ రెడ్డి, కాలే ప్రసాద్, ఖాదర్ పాషా, జీవి భద్రం, భూక్య నాగేశ్వరరావు, యదళ్లపల్లి అనసూయ, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖమ్మం చిన్నారిపై దారుణానికి మహిళా సంఘాల ఆగ్రహం

- నిందితుడికి అత్యంత కఠిన శిక్ష విధించాలని డిమాండ్



**లక్ష్మీదేవిపల్లి, జూన్ 14 ( ప్రజాజ్యోతి )** ఖమ్మంలో 12 ఏళ్ల బాలికపై జరిగిన అత్యాచారం, హత్యాయత్నం ఘటనపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం శేషగిరినగర్ గ్రామపంచాయతీలో మహిళా సంఘాల నాయకురాళ్లు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ అనుబంధ మహిళా సంఘాలైన ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ, డీహెచ్‌పీఎస్ నాయకురాళ్లు మాట్లాడుతూ అమాయక చిన్నారిపై జరిగిన ఈ దారుణం సభ్య సమాజం తలదించుకునే ఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి సెలవుల సందర్భంగా తాతయ్య ఇంటికి వచ్చిన చిన్నారి జీవితాన్ని ఓ కామాంధుడు చీకట్లోకి నెట్టేశాడని పేర్కొన్నారు. ఆటలు, చదువులు, ఆనందాలతో గడపాల్సిన వయసులో ఆమెపై అమానుషంగా దాడి జరగడమే కాకుండా, తన నేరాన్ని దాచిపెట్టేందుకు భవనం మూడో అంతస్తు నుంచి కిందికి తోసివేయడం అత్యంత క్రూరమైన చర్య అని మండిపడ్డారు. ప్రస్తుతం చిన్నారి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆమె కుటుంబం తీవ్ర మానసిక వేదన అనుభవిస్తోందన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి నిందితుడికి చట్టం ప్రకారం అత్యంత కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. మహిళలు, బాలికల భద్రత కోసం ప్రభుత్వం మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. బాధిత చిన్నారికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు కరిష రత్నకుమారి, రేణిగుంట్ల లక్ష్మి, కుంటి పుష్ప, జంగం రాజమణి, బుజ్జమ్మ, లక్ష్మి, బయమ్మ, సునీత, విజయ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు



**ఆళ్ళపల్లి. జూన్14 (ప్రజా జ్యోతి )** బైక్ అదుపుతప్పి ఒకరు తీవ్ర గాయాల పాలైన ఘటన ఆదివారం మండల పరిధిలోని అనంతోగులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భూపాలపల్లి జిల్లాకు చెందిన రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తి తన స్నేహితుడితో కొత్తగూడెంలో సింగరేణి కి సంబంధించిన పరీక్ష నిమిత్తం గుండాల ఆళ్లపల్లి మీదుగా కొత్తగూడెం వెళుతున్న క్రమంలో అనంతోగు బ్రిడ్జి వద్ద బైక్అదుపుతప్పి క్రింద పడడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు స్థానిక విలేఖరి సమాచారం మేరకు 108 సిబ్బంది పైలట్ సునీల్ కుమార్ ఈ ఎన్ టి ఆకాశ్ ఘటనస్థలికి చేరుకొని రాజేంద్రప్రసాద్ కు ప్రథమ చికిత్స అందించారు అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రి తరలించడం జరిగింది.

## నేడు గిరిజన దర్బార్.....ప్రజావాణి

**భద్రాచలం టౌన్, జూన్ 14, ప్రజాజ్యోతి,**
భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్, సబ్‌కలెక్టరు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు అధికారులంతా సకాలంలో హాజరై వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే వారి వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించడంతో పాటు వాటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్, సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్టలు పేర్కొన్నారు. ప్రజలు తమ విజ్ఞాపన పత్రాలు, తగిన ధృవీకరణ పత్రాలతో రావాలని కోరారు.

# 12 ఏళ్ల మోదీ పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- తెలంగాణలో బీజేపీ జెండా ఎగరేయడమే లక్ష్యం
- విలేకరుల సమావేశంలో ఉదయ్ ప్రతాప్, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**కొత్తగూడెం, జూన్ 14 ( ప్రజాజ్యోతి )** ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనలో దేశం సాధించిన అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని బీజేపీ నల్గొండ జిల్లా ఇన్‌చార్జి ఉదయ్ ప్రతాప్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రామలింగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి సమక్షంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందని పేదలు, రైతులు, మహిళలు, యువతకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఉజ్వల యోజన, ప్రధానమంత్రి సడక్ యోజన, ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్ యోజన, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్టాండ్‌అప్ ఇండియా వంటి పథకాలు దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా కేంద్ర ప్రభుత్వం అనేక ప్రజా ప్రయోజన కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. భద్రాచలం రోడ్–సత్తుపల్లి రైల్వే లైన్ పనులు పూర్తి కావడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కృషి ఫలితమేనని చెప్పారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు కేంద్ర పథకాల పూర్తి ప్రయోజనాలు అందకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.98 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. భద్రాచలం అభివృద్ధికి ప్రధాని మోదీ ప్రత్యేక చొరవ తీసుకున్నారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయ అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం వంటి పారిశ్రామిక జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని అయితే జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు అభివృద్ధి కంటే రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో ఓటు బ్యాంకు రాజకీయాలు పెరిగిపోయాయని, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని పక్కన పెట్టారని విమర్శించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చెరుకు భాగ్యలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శులు జాటోత్ వెంకన్న నాయక్, భోగి కృష్ణ, పుణ్యం బిక్షపతి, కార్యదర్శులు తుంపూరి శివ, పుణ్యా నాయక్, ఎస్ఐఆర్ కన్వీనర్ మోహన కృష్ణ, మీడియా కన్వీనర్ రామారావు, జిల్లా కార్యాలయ కార్యదర్శి దురిశెట్టి కుమార్, మహిళా నాయకురాళ్లు సముద్రాల గాయత్రి, పద్మ పాల్గొన్నారు.

## వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలు వేసుకోవాలి

- వ్యవసాయ శాఖ అధికారి బాబురావు

**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 14 ,(ప్రజా జ్యోతి )** జిల్లాలో రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులను నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారి బాబురావు రైతులను కోరారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జూన్ 8వ తేదీ నాటికి నైరుతి రుతుపవనాలు పూర్తిగా విస్తరించడంతో రానున్న రోజుల్లో సాధారణం నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు, కావున రైతులువర్షాధార పంటల సాగుకు అనుకూల పరిస్థితులు నెలకొన్నందున పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, మినుము, ఆముదం వంటి పంటల సాగుకు సిద్ధం కావాలని సూచించారు. విత్తనాల ఎంపికలో ధృవీకరించబడిన, నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు.పొలాల్లో అధిక తేమ లేకుండా నీరు నిల్వ కాకుండా కాలువలు ఏర్పాటు చేయాలని, నేలలో తగిన తేమ ఉన్నప్పుడే విత్తనాలు వేయాలని సూచించారు. కృష్ణా జిల్లాలో సాధారణం కంటే తక్కువ, ములుగు జిల్లాలో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు చర్యలు చేపట్టాలన్నారు, చెరువులు, కుంటలు ఇతర నీటి వనరులను శుభ్రపరచి వర్షపు నీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడరాదని, పశువులను కూడా అక్కడ ఉంచరాదని రైతులకు హెచ్చరించారు.వేరుశనగ, సోయాబీన్, జొన్న, పెసర, కంది, మినుము వంటి పంటల విత్తనాలను విత్తే ముందు శాస్త్రీయ పద్ధతిలో విత్తన శుద్ధి చేయడం ద్వారా ప్రారంభ దశలో వచ్చే వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. వరి నారు మళ్ల కోసం నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని, తెలంగాణ సోనా వంటి అధిక దిగుబడి రకాలను వినియోగించాలని సూచించారు.వాతావరణ శాఖ జారీ చేసే సూచనలు, హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుని సాగు పనులు చేపట్టాలని రైతులను కోరారు.

## ఎరువుల దరల పెంపుపై వ్యవసాయ సాగు రైతులు గందరగోళం

- వ్యవసాయం సాగు రైతులకు శాపంగా మారిందని పలువురు ఆందోళన
- ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి పూనెం రంగన్న



**ఆళ్ళపల్లి. జూన్14 ప్రజా జ్యోతి )** రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యారని ఎరువుల ధరల పెంపుపై వ్యవసాయ సాగు చేయాలంటే మండల రైతులు గందరగోళానికి గురయ్యారని, వ్యవసాయం సాగు రైతులకు శాపంగా మారిందని, పలువురు రైతులు ఆందోళనకు గురౌతున్నారని, జూన్ 19న మండల తహసిల్దార్ కార్యాలయాల ముట్టడి నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అఖిల భారత రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి పూనెం రంగన్న పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మైలారం గ్రామంలో కార్యవర్గ సభ్యులు బొజ్జయ్య స్వగృహంలో ఆదివారం ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు కొమరం సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూనెం రంగన్న పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతే రాజు అన్న నానుడికి భిన్నంగా రైతు నల్ల చట్టాలను తెచ్చి, రైతుల మెడకు ఉచ్చు బిగుస్తోందన్నారు. పల్లె గ్రామాల్లో నకిలీ విత్తనాలు ఏరువుల అధిక ధరల పెంపు, 2025 ముసాయిదా విద్యుత్ బిల్లు, విత్తన చట్టం, గ్రామీణ ఉపాధి హామీ పథకం పేర్లు మారుస్తూ రైతులకు వ్యవసాయంపైనే విసుగెత్తేలా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువుల ధరల పట్టిక ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని, లేనియెడల గ్రామీణ ప్రాంతంలోని వ్యాపార వర్గాలు, దళారులు ఇష్టంవచ్చినట్లుగా అధిక ధరలతో రైతుల నడ్డివిరుస్తున్నారని ఆరోపించారు. కేంద్రం ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరిస్తుందని రైతు బాగోగుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు చేయలేదని ఆరోపించారు. ఆన్లైన్ విధానం సైతం దిగుబడి మొత్తానికి చేయలేదని, దీంతో పండిన జొన్నలు యాప్లో రికార్డు కాలేదని, యాప్ పై రైతులకు అవగాహన లేదని, వ్యవసాయ అధికారులు యాప్ పై రైతులకు అవగాహన కల్పించాలని, రైతులకు భారీ నష్టం వాటిల్లిందని, కొనుగోలులో జాప్యం జరిగి సరిగా అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని, క్వింటాకు 600 నుండి 800 రూపాయల వరకు రైతులు నష్టపోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈదో పిడీ సొమ్మును సంబంధిత అధికారులు, వ్యాపారులు సైతం కుమ్మక్కై అమ్ముకున్నారన్నారు. ఈఅవినీతిని అరికట్టాలని నిరుపేద గిరిజన ప్రాంతం రైతులను ఆదుకునేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటుగా ఎరువుల ధరలను సమాంతరంగా ఉండేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల ఉపాధ్యక్షులు బొర్ర వెంకన్న, మండల సహాయ కార్యదర్శి మెస్సు గోపాల్, మండల కార్యవర్గ సభ్యులు బొజ్జయ్య, పూసం రాంబాబు, గోగ్గల గాదేరాజు, ఇస్లావత్ రామదాసు, పూనెం రాంబాబు, వాగబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





- విధుల్లో ఉన్న పోలీసులనే ఢీకొట్టిన లారీ
- కానిస్టేబుల్, హోంగార్డుకు తీవ్ర గాయాలు
- అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు
- ఘర్షణల తర్వాత చోటుచేసుకున్న ఘటన
- సోంపల్లి ర్యాంపుపై మళ్లీ తెరపైకి వచ్చిన అక్రమాల ఆరోపణలు

# ఇసుక ర్యాంపులో... ఉద్రిక్తత...

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సోంపల్లి ఇసుక ర్యాంపు వద్ద ఆదివారం చోటుచేసుకున్న పరిణామాలు జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అక్రమ ఇసుక రవాణా జరుగుతోందంటూ గ్రామస్తులు లారీలను అడ్డుకోవడం, అనంతరం పరిస్థితిని చక్కదిద్దేందుకు వెళ్లిన పోలీసు సిబ్బందినే ఇసుక లారీ ఢీకొట్టడం కలకలం రేపింది. ఈ ఘటనలో విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ మంగీలాల్, హోంగార్డు శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడగా, ప్రభుత్వ ఆస్తి కూడా ధ్వంసమైంది.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

### ♦ అక్రమ రవాణాపై గ్రామస్తుల ఆగ్రహం

స్థానికుల కథనం ప్రకారం సోంపల్లి ఇసుక ర్యాంపు నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా జరుగుతోందని ఆరోపిస్తూ ఆదివారం గ్రామస్తులు లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ర్యాంపు నిర్వాహకుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో గ్రామస్తులపై దాడులు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

### ♦ శాంతిభద్రతల కోసం రంగంలోకి దిగిన పోలీసులు

సమాచారం అందుకున్న వెంటనే బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌కు చెందిన బ్లూ కోల్ట్ సిబ్బంది కానిస్టేబుల్ మంగీలాల్, హోంగార్డు శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇరు వర్గాలతో మాట్లాడి ఉద్రిక్తతను తగ్గించే ప్రయత్నం చేశారు. గ్రామస్తులకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చిన అనంతరం వారు తిరిగి పోలీస్ స్టేషన్‌కు బయలుదేరారు.

### ♦ లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు

దోమలవాగు సమీపంలో పోలీసు సిబ్బంది ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఏపీ-16-టీజే-3569 నంబర్ గల ఇసుక లారీ అతివేగంగా వచ్చి బైకును బలంగా ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద తీవ్రతకు కానిస్టేబుల్ మంగీలాల్, హోంగార్డు శ్రీనివాసరావు రోడ్డుపై పడిపోయి గాయపడ్డారు. ప్రమాదంలో పోలీసు సిబ్బంది ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం తీవ్రంగా దెబ్బతినడంతో పాటు విధి నిర్వహణలో ఉపయోగిస్తున్న రెండు ప్రభుత్వ ట్యాబ్‌లు కూడా ధ్వంసమయ్యాయి.

### ♦ ఆసుపత్రికి తరలింపు... కేసు నమోదు

ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు, తోటి సిబ్బంది గాయపడిన వారిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ సిబ్బందికి ప్రమాదం కలిగించిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



### ♦ ర్యాంపుపై కొనసాగుతున్న వివాదాలు

సోంపల్లి ఇసుక ర్యాంపు కార్యకలాపాలపై గత కొంతకాలంగా స్థానికంగా పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపు జరుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తుండగా, ఈ అంశంపై సంబంధిత శాఖలు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రివేళల్లో కూడా ఇసుక రవాణా కొనసాగుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

### ♦ మైనింగ్ శాఖపై ప్రశ్నలు

అక్రమాలపై ఫిర్యాదులు వస్తున్నప్పటికీ పర్యవేక్షణ సరైన స్థాయిలో లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తనిఖీలు నిర్వహించినా అవి ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని స్థానికులు అంటున్నారు. అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడటమే కాకుండా గ్రామీణ రహదారులు కూడా దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ♦ అధికారుల జోక్యం కోరుతున్న ప్రజలు

గ్రామస్తుల నిరసనలు, పోలీసు సిబ్బంది ప్రమాదానికి గురికావడం, ర్యాంపు కార్యకలాపాలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సోంపల్లి ఇసుక ర్యాంపు వ్యవహారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. వాస్తవ పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



## ఉద్యోగాల ఆశ చూపించి లక్షల రూపాయలు కాజేసిన కేటుగాడు

- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన దమ్మపేట పోలీసులు

**దమ్మపేట, జూన్ 14 (ప్రజాజ్యోతి) :** సాఫ్ట్ వేర్ ఉద్యోగాల పేరుతో యువకులను నమ్మబలికి లక్షల రూపాయలు వసూలు చేసి, అనంతరం మెరుగైన ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసానికి పాల్పడిన ఘటన దమ్మపేట మండలంలో వెలుగుచూసింది. బాధితుల ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, ముష్టిబండ గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌తో పాటు మరో ఇద్దరు యువకులు ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న సమయంలో హైదరాబాద్‌కు చెందిన అమర్నాథ్ అనే వ్యక్తి వారిని సంప్రదించాడు. ప్రముఖ సాఫ్ట్ వేర్ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చి వారి నుంచి విడతల వారీగా మొత్తం రూ.5.40 లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. తరువాత హైదరాబాద్‌లో మున్నాకు చెందిన ఓ సంస్థలో ఉద్యోగాలు కల్పించిన అమర్నాథ్, అక్కడ కొంతకాలం పనిచేయాలని సూచించాడు. సుమారు ఐదు నెలల పాటు విధులు నిర్వహించినప్పటికీ వారికి సరైన వేతనాలు అందలేదని బాధితులు పేర్కొన్నారు. ఇదే సమయంలో మరో ప్రముఖ కంపెనీలో అధిక వేతనాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వెంటనే ప్రస్తుత ఉద్యోగాలకు రాజీనామా చేస్తే కొత్త సంస్థలో నియామకాలు కల్పిస్తానని అమర్నాథ్ హామీ ఇచ్చాడు. అతని మాటలను నమ్మిన యువకులు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసినప్పటికీ, అనంతరం కొత్త ఉద్యోగాలు ఇప్పించకుండా నెలల తరబడి కాలయాపన చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని, ఉద్యోగాలు కల్పించాలని కోరినా స్పందించకపోవడంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు దమ్మపేట పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ప్రాథమిక విచారణ అనంతరం అమర్నాథ్‌పై మోసం, నమ్మకద్రోహానికి సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడి పాత్ర, డబ్బుల లావాదేవీలు, బాధితుల నుంచి సేకరించిన వివరాలపై సమగ్ర విచారణ కొనసాగుతున్నట్లు తెలిపారు.

- ఉద్యోగాల పేరుతో మోసాలపై అప్రమత్తంగా ఉండాలి... ఎస్ ఐ రాజేష్

ఉద్యోగాల పేరుతో భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తులను నమ్మవద్దని, నియామక ప్రక్రియ, సంస్థ వివరాలు, ఆఫర్ లెటర్లు తదితర అంశాలను పూర్తిగా ధృవీకరించుకున్న తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని, ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసే వారిపై అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని దమ్మపేట ఎస్ ఐ రాజేష్ సూచించారు.

## రసూల్ ఖాన్ మెరుపు సెంచరీతో సీనియర్-11 విజయం





**కొత్తగూడెం, జూన్ 14 ( ప్రజాజ్యోతి )** ప్రకాశం స్టేడియంలో ఆదివారం జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ అభిమానులకు ఉత్కంఠభరిత వినోదాన్ని అందించింది. సీనియర్-11 జట్టు బ్యాటర్ రసూల్ ఖాన్ మెరుపు సెంచరీతో చెలరేగడంతో జూనియర్-11 జట్టుపై 8 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన సీనియర్-11 జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. రసూల్ ఖాన్ కేవలం 57 బంతుల్లో 22 ఫోర్లతో అజేయంగా 118 పరుగులు చేసి జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. దశరథ్ రజువా 22, రమేష్ 16 పరుగులతో రాణించారు. 184 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జూనియర్-11 జట్టు చివరి వరకు పోరాడింది. సాయి నాయుడు 86 పరుగులతో విజృంభించినప్పటికీ జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయాడు. కట్ట 35, విశ్వనాథ్ 19 పరుగులు చేశారు. నిర్ణీత ఓవర్లలో జూనియర్-11 జట్టు 175 పరుగులకే పరిమితమైంది. సీనియర్-11 బౌలర్లలో రవి సభాని రెండు వికెట్లు సాధించగా అప్పన్న, సత్తిపండు, పఠాన్ చెరో వికెట్ దక్కించుకున్నారు. మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన రసూల్ ఖాన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. దాదాపు పాతికేళ్ల క్రితం స్థానిక క్రికెట్‌లో గుర్తింపు పొందిన రసూల్ ఖాన్, దశరథ్ రజువా మరోసారి ప్రకాశం స్టేడియంలో తమ ప్రతిభను చాటుకోవడం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

## పినపాక ఎస్సీ బాలుర వసతి గృహంలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

- 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలు
- ఉచిత వసతి, భోజన సౌకర్యాలు
- వసతి గృహ సంక్షేమ అధికారి సతీష్

**పినపాక,జూన్ 14(ప్రజాజ్యోతి)** పినపాక మండల కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహంలో నూతన విద్యా సంవత్సరానికి గానూ అడ్మిషన్ల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైందని వసతి గృహ సంక్షేమ అధికారి సతీష్ ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఈ చక్కని అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలల్లో 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుకునే బాలురందరూ ఈ వసతి గృహంలో చేరడానికి అర్హులని స్పష్టం చేశారు. ఇక్కడ చేరిన విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ పౌష్ఠికాహారంతో కూడిన భోజనం, సురక్షితమైన తాగునీరు మరియు ఉచిత వసతి కల్పించబడుతుందని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇది ఎంతో మేలు చేకూరుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థి ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతి,4 పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫోటోలు, కుల మరియు ఆదాయ ధృవీకరణ పత్రాలు, పాఠశాల బోనఫైడ్ / స్టడీ సర్టిఫికేట్ తో సంప్రదించాలని కోరారు.ప్రవేశాలు పరిమితంగానే ఉన్నందున, ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లల వివరాలతో మరియు అవసరమైన సర్టిఫికేట్లతో సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కొరకు కార్యాలయ వేళల్లో 9492101442 ను సంప్రదించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

- 108 సిబ్బంది సమయస్ఫూర్తితో యువకుడికి ప్రాణరక్షణ



**టేకులపల్లి, జూన్ 14 (ప్రజాజ్యోతి):** టేకులపల్లి మండల పరిధిలోని తంగెళ్ల తండా గ్రామానికి చెందిన ఇస్లావత్ నగేష్ (23) శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంకటయ్య తండా సమీపంలో బైక్‌పై ప్రయాణిస్తున్న సమయంలో అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చిన అరక అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో నగేష్ నాలుకకు తీవ్ర గాయమవడంతో పాటు ముఖం, నోటి భాగాల్లో గా యాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అంబులెన్స్ సిబ్బంది వేగంగా సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడికి ప్రథమ చికిత్స అందించారు.గాయాల తీవ్రతను గుర్తించిన 108 సిబ్బంది మెరుగైన వైద్యం కోసం నగేష్‌ను ఇల్లందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఈఎంటీ అశోక్, పైలెట్ నాగేశ్వరరావు సమయస్ఫూర్తితో వ్యవహరించి బాధితుడికి సకాలంలో వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే స్పందించి బాధితుడి ప్రాణాలను కాపాడేందుకు కృషి చేసిన 108 సిబ్బందిని స్థానికులు అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులపై ప్రయాణించే సమయంలో పశువులు, ఇతర అడ్డంకులు అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చే అవకాశం ఉన్నందున వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## లోన్ ఇప్పిస్తామని భార్యభర్తలను మోసం చేసిన సైబర్ నేరస్తుడు

**భద్రాచలం టౌన్, జూన్ 14 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని భగవాన్‌దాస్ కాలనీకి చెందిన భార్య, భర్తలను లోన్ ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసి రూ.52 వేలు కాజేసిన ఘటనపై భద్రాచలం సీఐ నాగరాజుకు అందిన ఫిర్యాదు మేరకు కేసు మోదు చేసారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మానస–నరసింహారావు దంపతులకు లోను అవసరం ఉండటంతో పాటు ఫేస్బుక్‌లో రిలయన్స్ లోన్ సర్వీసు ఉన్న లింక్‌ను సంప్రదించారు. ఈ సమయంలో సదరు వ్యక్తి మీ భార్య పేరుతో రూ.15 లక్షలు లోన్ వచ్చే అవకాశం ఉందని, అందుకు సంబంధించి ప్రాసెసింగ్ ఫీజు, ట్యాక్స్, ఇన్సూరెన్సు కింద రూ.52 వేలు ముందుగా చెల్లించాలని కోరారు. దీంతో వారు ఏప్రిల్ 10 నుంచి 14వ తేదీ మధ్యలో విడతలవారీగా రూ.52 వేలు అతని ఫోన్‌కు పంపారు. అనంతరం వీరు ఎన్నిసార్లు సంప్రదించినా ఆ నెంబరుకు ఎన్నిసార్లు ఫోను చేసినా ఎటువంటి సమాధానం రాకపోవడంతో తాము మోసపోయామని గ్రహించి 1930 సైబర్‌సెల్‌కు ఫోన్ చేసి జరిగిన విసయాన్ని చెప్పారు. అలాగే శనివారం రాత్రి భద్రాచలం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసారు. దీంతో సీఐ నాగరాజు సైబర్‌నేరంగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బడి గంట.... మోగింది

- బ్యాగుల మోత వారం అవుతున్న విద్య
- పైసల బడిక . ప్రభుత్వ బడిక
- ఆటపాటలతో విద్య దూరమవుతుంది అబ్బా



**గుండాల. జూన్ 14. ప్రజా జ్యోతి** నేటి కంప్యూటర్ యుగంలో సరికొత్త మార్పులు వస్తున్నప్పటికీ పేదవాడికి విద్య అందరిని దాక్షగానే మిగిలింది. ప్రభుత్వ పాఠశాలలు రోజురోజుకు దిగజారుపోతూ ఉన్నాయి. పాఠశాలలు ఉన్నప్పటికీ సరైన సౌకర్యాలు బోధన సిబ్బంది పర్యవేక్షణ అధికారులు సక్రమంగా లేక ప్రభుత్వ పాఠశాలల పనితీరు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారుతుంది పాఠశాలలో కొన్నిచోట్ల సౌకర్యాలు ఉన్నప్పటికీ బోధన సిబ్బంది స్థానికంగా ఉండకుండా కుదర ప్రాంతాల నుండి రాకపోకలు సాగిస్తూ కాలం వెళ్ళదిస్తున్నారు. బోధన సిబ్బంది ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ అధికారులు సక్రమంగా లేకపోవడం మండల , మండల స్థాయిలో మండల విద్యాశాఖ అధికారి లేకపోవడం కారణంగా ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల్లో విద్యార్థుల తల్లిదండ్రులలో ప్రభుత్వ పాఠశాలలపై చిన్న చూపు చూస్తున్నారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ పాఠశాలల్లో బోధన సిబ్బంది సరిగా లేకపోవడం మూలంగా ప్రభుత్వ పాఠశాలల నుండి పైసల పాఠశాలకు మరలుతున్నారు. ప్రైవేటు పాఠశాలలపై సైతం ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణ లేకుండా పాఠశాలలో బోధన సిబ్బందిని గాడియేషన్ లేకుండా బోధిస్తున్నప్పటికీ వాటిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. నాడు పాఠశాలలో ఆటపాటలతో విద్యను బోధించిన సిబ్బంది , ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్య అందించాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో విద్యను బట్టి పట్టిస్తూ విద్యార్థులను మానసికంగా ,శారీరకంగా నైపుణ్యతను అందించలేకపోతున్నారు చిన్నపిల్లలను బడి అంటే ఇష్టంగా ఉండేలా నాడు ఉంటే నేడు బడి అంటేనే భారంగా చూస్తున్నారు. పలక బలపం తోని విద్యార్థులను పనికి పంపాల్సిన తల్లిదండ్రులు నేడు బ్యాగుల మోతతో బడికి పంపాల్సిన పరిస్థితి నెలకొంది ప్రభుత్వం స్పందించి పాఠశాలలపై ఉన్నత అధికారుల పర్యవేక్షణ ప్రైవేట్ పాఠశాలలపై పరవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది

## మృతదేహంతో ప్రయివేటు ట్రావెల్స్ కార్యాలయం ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా





**భద్రాచలం టౌన్ , జూన్ 14 , ప్రజాజ్యోతి** అశ్వాపురం మండలం బీజీకొత్తూరు వద్ద శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ ప్రయివేటు ట్రావెల్స్‌కు చెందిన డ్రైవరు మల్లెల సత్యసాయి మృతదేహంతో ఆదివారం కుటుంబ సభ్యులు కూనవరం రోడ్డులో ఉన్న ప్రయివేటు ట్రావెల్స్ కార్యాలయం ఎదుట మృతదేహాన్ని ఉంచి ధర్నా నిర్వహించారు. రెండు గంటలకు పైగా ధర్నా చేపట్టడంతో రోడ్డుపై ట్రాఫిక్ నిలిచింది. సత్యసాయి భార్య, పిల్లలు రోదిస్తుండటంతో కుటుంబ ఆధారంగా కోల్పోవడంతో వారి కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆదుకోవాలని యాజమాన్యాంను డిమాండ్ చేసారు. దీంతో సంఘటన స్థలంకు వచ్చిన పోలీసులు మృతుని కుటుంబ సభ్యులతో పాటు యజామాన్యం వారితో మాట్లాడారు. విధి నిర్వహణలో భాగంగా మణుగూరు రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకోవడంతో సంస్థే బాధ్యత వహించాలని, కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. అనంతరం మృతదేహాన్ని అక్కడ నుంచి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు.

## భద్రాద్రి రామాలయంలో భక్తుల రద్దీ

- దర్శనంకు రెండు గంటలకు పైగా సమయం
- ఆర్జిత సేవలన్నీ రద్దు చేసిన దేవస్థానం
- రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం



**భద్రాచలం టౌన్, జూన్ 14 ప్రజాజ్యోతి,** భద్రాచలంలో ఆదివారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో రామాలయంతో పాటు ఆలయ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. వేసవి సెలవులు ముగియడం, సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానుండటంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనం కోసం వచ్చారు. భక్తులు తెల్లవారుజాము నుంచే పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించి రామయ్య దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. భక్తుల సంఖ్య అధికంగా ఉండటంతో దేవస్థానంలో ఆర్జిత సేవలన్నీ రద్దు చేసి నేరుగా భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. ఉచిత దర్శనంతో పాటు రూ.100 శీఘ్ర దర్శనంపై భక్తులను అనుమతించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తుల రద్దీ కొనసాగగా అనంతరం సాధారణ స్థితికి చేరుకుంది. అలాగే సాయంత్రం సైతం భక్తుల రద్దీ అధికంగానే ఉంది. దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం...**

ఆదివారం సందర్భంగా రామాలయంలో భద్రాద్రి రామయ్యకు ప్రత్యేక అభిషేకం, నిత్యకల్యాణం నిర్వహించారు. నిత్యకల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేన అర్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

## విద్యార్థుల ప్రవేశాలు తగ్గడానికి పాలకుల విధానాలే కారణం

- టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు

**భద్రాచలం టౌన్ , జూన్ 14 ప్రజాజ్యోతి** విద్యారంగానికి బడ్జెట్లో సరిపడా నిధులు కేటాయించకపోవడం పాఠశాలలో కనీస వసతి సౌకర్యాలు కల్పించకపోవడం తగినంత మంది ఉపాధ్యాయులను సరైన సమయంలో నియమించకపోవడం వల్లనే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు ప్రతి సంవత్సరం తగ్గుతూ వస్తున్నాయని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు అన్నారు. టిపిటిఎఫ్ భద్రాచలం కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు పాయం కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన భద్రాచలం ప్రాంత బాధ్యుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాలకులు మారినప్పుడల్లా తమకు అనుకూలమైన రీతిలో విద్యారంగాన్ని అనేక మార్పులకు గురిచేస్తూ పేద బలహీన వర్గాల బాలబాలికలకు విద్యను దూరం చేయాలని చూస్తున్నారని అన్నారు. విద్యను సరుకుగా, వ్యాపార రంగంగా మార్చారని అన్నారు. విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని మూతబడిన ఆరు వేల పాఠశాలలను తెరిపిస్తామని ప్రతి ఆవాస ప్రాంతంలో ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పుతామని ఎన్నికల ప్రణాళికలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి 27 వేల పాఠశాలలను 4 వేలకు కుదిస్తామని చెప్పిన ప్రకటనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు తాటి సత్తిబాబు, పాయం కృష్ణయ్య, రాష్ట్ర మాజీ కార్యదర్శి మునిగడప రామాచారి, వివిధ మండలాల బాధ్యులు బి.ప్రకాష్ రావు, వి.ముత్తయ్య, బి.రవి పాల్గొన్నారు.



# రక్తదానం...మహాదానం

- అవసరానికి రక్తం అందించి ప్రాణదాతలుగా మారండి... ఎమ్మెల్యే జారే
- కారం సుధీర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ,
- కాంగ్రేస్ పార్టీ జిల్లా నాయకులు బత్తుల అంజి
- సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం: బత్తుల అంజి



**ములకలపల్లి, జూన్14, (ప్రజాజ్యోతి) :,** కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకుడు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రధాన అనుచరుడు, సీతాయిగూడెం మాజీ సర్పంచ్ కారం సుధీర్ జన్మదిన వేడుకలను ఆదివారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించి, రక్తదాతలకు పండ్లు, పండ్ల రసాలను పంపిణీ చేశారు. అనంతరం కారం సుధీర్‌తో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, రక్తదానం మహోన్నతమైన సేవ అని, ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు. సమాజ సేవా భావంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన కారం సుధీర్‌ను అభినందిస్తూ, శిబిరంలో పాల్గొన్న రక్తదాతలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజి మాట్లాడుతూ, పుట్టినరోజు సందర్భంగా అనుచరులు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ, రక్తదాన శిబిరం ఏర్పటు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదానం చేయడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. కారం సుధీర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండల వ్యాప్తంగా సుధీర్ అభిమానులు పలు ప్రాంతాల్లో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి జహీరుద్దీన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పర్వతనేని అమర్నాథ్, కరటూరి కృష్ణ, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాగళ్ళ వెంకశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు అనుమోలు సత్యనారాయణ, గాడి తిరుపతి రెడ్డి, బాల అప్పారావు, సురభి రాజేష్, మీడియం బుల్లెబ్బాయి, వాడే శేషగిరి, సున్నం సుధాకర్, అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలకుర్తి సుమిత్, యువజన కాంగ్రెస్ ములకలపల్లి మండల అధ్యక్షుడు కొడిమె వంశీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభి





# అసంపూర్ణ ఇళ్ల ప్రారంభోత్సవాలు వద్దు

- ఇల్లు పూర్తయిన తర్వాతే ప్రారంభించాలని బీజేపీ డిమాండ్
- బిల్లులు విడుదల కాక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు



**దమ్మపేట, జూన్ 14 (ప్రజాజ్యోతి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను బీజేపీ నియోజకవర్గ నాయకుడు తంబళ్ల రవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇళ్లు పూర్తిగా నిర్మాణం పూర్తికాకముందే మంత్రులు, ఎమ్మెల్యేలు అత్యుత్సాహంతో ప్రారంభోత్సవాలు నిర్వహించడం సరికాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్ణంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించిన పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కూడా అదే పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బిల్లులు విడుదల కాకపోవడంతో అప్పులు చేసి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని, తీసుకున్న అప్పులకు వడ్డీలు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేసి లబ్ధిదారులకు ఊరటనివ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తయిన అనంతరమే ప్రారంభోత్సవాలు నిర్వహించాలని బీజేపీ పార్టీ తరఫున ప్రభుత్వాన్ని కోరుతున్నామని తంబళ్ల రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గూడా ముత్యాలరావు, పూచి ప్రసాద్, కారం రత్నకుమారి, ఆళ్ల సుజాత తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న శాంతి విద్య నికేతన్ స్కూల్ హెచ్ఎం సిస్టర్ మహితకు ఘన సన్మానం



**ఆళ్ళపల్లి.జూన్14 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలోని, శాంతి విద్యనికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లోని హెచ్ఎం సిస్టర్ మహిత (నన్) ఆర్సియం పునీత పౌలు, పేతురు చర్చిలోని గత రెండేళ్లుగా పాఠశాల విధులతో పాటు, అనేక ఆధ్యాత్మిక, సామాజిక సేవలను అందించిన సిస్టర్ మహితకు ఆదివారం బదిలీల్లో భాగంగా ఆర్సియం పునీత పేతురు పౌలు చర్చి తిరు హృదయ విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ సిద్దెల జేసు ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా పట్టు శాలవతో సన్మానించడం జరిగిందని ఉమ్మడి ఖమ్మం జ్యోతిర్మయి యానిమేటర్ పరమ ప్రభాకర్ తెలిపారు. అనంతరం ఫాదర్ సిద్దెల జేసు ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ డిఎస్ఎస్ సభను కేరళ రాష్ట్రంలో ప్రారంభించి, కర్ణాటక, కేరళ, ఆంధ్ర, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో 4 ప్రోవెన్షియల్ సభలుగా ఏర్పడ్డాయని, కేరళ రాష్ట్రంలోని డిఎస్ఎస్ ప్రొవెన్షియల్, సిస్టర్ శిల్పా ఆదేశాల మేరకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో ఆళ్లపల్లి మండలంలోని శాంతి విద్య నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బాధ్యతలు నిర్వహించినందుకు గతేడాది బదిలీ చేయడం జరిగిందన్నారు. అనంతరం మండల వ్యాప్తంగా శాంతి విద్య నికేతన్ పాఠశాల్లోని హెచ్ఎం సిస్టర్ మహిత విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పిస్తూనే, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులతో సహా ఎంతో సత్సంబంధాలు ఏర్పరచుకొని, గ్రామస్తులు, అధికారులు, ప్రజల మన్ననలను అందుకోవడం సిస్టర్ మహితకే ఘనత దక్కిందన్నారు. విద్యార్థుల జీవితాల్లో భవ్యదివ్య తేజోమయ వెలుగులను నింపిపాఠశాలను, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన మహా ఉపాధ్యాయురాలు సిస్టర్ మహిత మాత్రమేనని కొనియాడారు. పిల్లలకు శారరీక, మానసిక ఉల్లాసానికీ క్రీడలు నిర్వహించి బహుమతులు, మెమొంటాలు, సైన్స్ ఫెయిర్ సైతం నిర్వహించి, మండల విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న మహిత సేవలు వెలకట్టలేనివని ఫాదర్ జేసు ప్రసాద్ గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో డిఎస్ఎస్ సిస్టర్స్ ప్రశాంత, నూతన హెచ్ఎం సిస్టర్ జీవనందా, దామరిస్, జ్యోతిర్మయి యానిమేటర్ ప్రభాకర్, సంఘనాయకులు కరకపల్లి నాగేష్, రాంబాబు, రామ్మూర్తి, కిరణ్, జీవన్, బన్నీ, సృచిల్, నవీన్, జోజి, సులోచన, బొబ్బిలి సౌమ్య, అన్నపూర్ణ, లలిత, జయమ్మ, విజయలక్ష్మి , ప్రశాంతి, అశ్విత, తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞానమే మాదిగల అభివృద్ధికి ఆయుధం

- మాదిగల జెండా పండుగను విజయవంతం చేయాలి
- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి రవి మాదిగ పిలుపు



**దమ్మపేట, జూన్ 14 (ప్రజాజ్యోతి) :** మాదిగ సమాజం విద్య, నైపుణ్యం, సృజనాత్మకతలను ఆయుధాలుగా చేసుకుని అన్ని రంగాల్లో ముందంజ వేయాలని ఎమ్మార్పీఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జి రవి మాదిగ పిలుపునిచ్చారు. దమ్మపేట మండలం ముష్టిబండ గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగల చైతన్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మూడు దశాబ్దాలపాటు సాగిన ఉద్యమ ఫలితంగానే పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని పేర్కొన్నారు. తెలంగాణలో మాదిగలకు లభిస్తున్న 9 శాతం రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో వినియోగించుకుని విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలని సూచించారు. సమాజంలో అక్షరాస్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, చదువులకు దూరమైన విద్యార్థులు తిరిగి విద్యాబాట పట్టాలని కోరారు. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలు విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో అగ్రస్థానానికి చేరుకోవాలంటే ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పేదరికం, భూమిలేమి, నిరక్షరాస్యత వంటి సమస్యలను అధిగమించేందుకు సామాజిక చైతన్యం అవసరమని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం 32వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జులై 7న ప్రతి గ్రామంలో మాదిగల జెండా పండుగను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దేపంగి రమణయ్య మాదిగ, రాష్ట్ర సీనియర్ నాయకుడు కొలికపోగు కాంతారావు మాదిగ, కొలికపోగు రవి, దాట్ల మహేష్, కొలికపోగు అశోక్, దాట్ల నవీన్, రావూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగు చర్యలు చేపట్టాలి

- జిల్లా రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు

**భద్రాచలం టౌన్, జూన్ 14, ప్రజాజ్యోతి** రాష్ట్రంలో జూన్ 8నే రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ అవి ఇంకా పూర్తిస్థాయిలో విస్తరించకపోవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తగా ఉండాలని భద్రాచలం ఐటీడీఏ వ్యవసాయ అధికారులు జిల్లా రైతులకు సూచిస్తున్నారు. పొలాల్లో అధిక తేమ లేకుండా నీరు నిల్వ కాకుండా కాలువలు ఏర్పాటు చేయాలని, నేలలో తగిన తేమ ఉన్నప్పుడే విత్తనాలు వేయాలని సూచించారు. జిల్లా రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారి బాబురావు తెలిపారు. చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులను శుభ్రపరచి వర్షపు నీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడరాదని, పశువులను కూడా అక్కడ ఉంచరాదని రైతులకు హెచ్చరించారు. వేరుశనగ, సోయాబీన్, జొన్న, పెసర, కంది, మినుము వంటి పంటల విత్తనాలను విత్తే ముందు శాస్త్రీయ పద్ధతిలో విత్తన శుద్ధి చేయడం ద్వారా ప్రారంభ దశలో వచ్చే వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. వరి నారుమళ్ల కోసం నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని, తెలంగాణ సోనా ఆర్ఎన్ఆర్–15048 వంటి అధిక దిగుబడి రకాలను వినియోగించాలని సూచించారు. వాతావరణ శాఖ జారీ చేసే సూచనలు, హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుని సాగు పనులు చేపట్టాలని రైతులకు వ్యవసాయ శాఖ పేర్కొంది.